క్లుప్తంగా

అరకొర యూరియా పంపిణీపై ఆందోళన



జి.ములగాం రైతు సేవా కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

చీపురుపల్లి: అరకొర యూరియా పంపిణీపై చీపురుపల్లి మండలం జి.ములగాం గ్రామ రైతులు శుక్రవారం ఆందోళన చేశారు. రైతులందరికీ ఎరువులు ఇచ్చేస్తామన్నట్టుగా అధికారులు హడావిడి చేశారు. డివిజనల్ స్థాయి అభివృద్ధి అధికారి (డీఎల్‌డీఓ) హేమసుందరరావు, తహసీల్దార్ ధర్మరాజు, ఎస్‌ఐ దామోదరరావు, ఏఓ సూర్యకుమారి, తదితరులు రైతు సేవా కేంద్రానికి వచ్చారు. అందరికీ యూరియా అందుతుందని క్యూలో ఉన్న సుమారు 500 మంది రైతులు భావించారు. తీరా 150 మందికే పంపిణీ చేసి చేతులెత్తేశారు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. అరకొర పంపిణీకి ఇంతమంది అధికారులు ఎందుకు వచ్చారంటూ మండిపడ్డారు.

సందర్శన



ముకుందపురం పాఠశాలలో విద్యార్థులచే పదాలు చదివిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: మండలంలోని ముకుందపురం, ఓబలయ్యపాలెం గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ బాలభాస్కరరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రికార్డులు, కిచెన్ గార్డెన్లను పరిశీలించారు. అలాగే విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేశారు. స్వచ్ఛ పక్వాడలో భాగంగా నీటి ఆవశ్యకత, నీటి వినియోగం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ రామప్రసాద్, తదితరులున్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

జామి: మండలంలోని పలు ఎరువుల దుకాణాలను విజిలెన్స్ సీఐ డీవీవీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం తనిఖీ చేశారు. భీమసింగి మన గ్రోమోర్, జామి బాలాజీ స్టోర్స్, తదితర ఎరువుల దుకాణాల్లో నిల్వలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ పూర్ణిమ, విజిలెన్స్ సిబ్బంది సురేష్‌కుమార్, కామేశ్వరరావు, తిరుపతిరావు, ఏఈఓ షేక్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వేపాడ: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని ఆతవలో డ్రైడేపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసర ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

సురక్షితమైన నీటిని అందించాలి

- జెడ్పీ సీఈఓ సత్యనారాయణ

గంట్యాడ: ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలని జెడ్పీ సీఈఓ బీవీ సత్యనారాయణ అన్నారు. మండలంలోని సిరిపురం గ్రామంలో గల తాగునీటి పథకాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. అలాగే చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బి.రాములమ్మ, కార్యదర్శి కె. శ్రీను, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వైదేహి, తదితరులు పాల్గొన్నారు.

కుళాయి నీటికి కష్టమొచ్చింది..



ఇందిరమ్మ సుజలధార తాగునీటి పథకం సంప్‌లు

- వారం రోజులుగా అస్తవ్యస్తంగా నీటి సరఫరా
- సంప్‌ల వద్ద పాడైన మోటార్లు
- మరమ్మతులు నిర్వహించడంలో నిర్లక్ష్యం
- పట్టించుకోని పాలకులు, అధికారులు

చీపురుపల్లి: అదేదో మండలానికి మారుమూల పల్లెటూరు కాదు.. సాక్షాత్తూ నియోజకవర్గ కేంద్రమైన చీపురుపల్లి మేజర్ పంచాయతీ. అటువంటి హెడ్ క్వార్టర్‌లోనే నీటి సరఫరాలో ఇబ్బందులేర్పడితే పాలకులకు పట్టించుకునే తీరిక లేదంటే శివారు ప్రాంతాల్లో సమస్య వస్తే ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఒకటి కాదు రెండు కాదు వారం రోజులుగా చీపురుపల్లి మేజర్ పంచాయతీలో ఇంటింటి కుళాయిల ద్వారా రావాల్సిన తాగునీరు అస్తవ్యస్తంగా, అరకొరగా వస్తున్నప్పటికీ సమస్యను పరిష్కరించే వారు కరువవ్వడం దారుణమని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే చీపురుపల్లిలో ఇంటింటి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా నిలిచిపోవడం, రెండు రోజులకోసారి అరకొరగా నీరు రావడం సమస్యపై అటు రక్షిత మంచి నీటి విభాగం (ప్రాజెక్ట్స్) ఇటు మేజర్ పంచాయతీ అధికారులు ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటున్నారు తప్ప ప్రజలు ఇబ్బందులు పట్టించుకోకపోవడం శోచనీయం.



మోటారుకు మరమ్మతులు చేస్తున్న మెకానిక్‌లు

పాడైన మోటార్లు..

2008లో దివంగత మహానేత వైఎస్సార్ హయాంలో శ్రీకాకుళం జిల్లాలోని సంకిలి వద్ద నాగావళి నది నుంచి చీపురుపల్లి నియోజకవర్గంలోని ఇంటింటికీ కుళాయిల ద్వారా నీరు సరఫరా చేసేందుకు రూ.83 కోట్లతో ఇందిరమ్మ సుజలధార ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేశారు. అలా సంకిలిలోని నాగావళి నది నుంచి వచ్చిన నీరు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న నాలుగు లక్షల లీటర్ల సామర్థ్యం గల రెండు సంప్‌లకు చేరుతుంది. ఆ సంప్‌ల నుంచి అదే ఆవరణలో ఉన్న రెండు ఓహెచ్‌బీఆర్‌లకు మోటార్ల ద్వారా నీరు ఎక్కించి అక్కడి నుంచి ఇంటింట కుళాయిలకు సరఫరా చేస్తారు. అయితే ఈ సంప్‌ల వద్ద ఉన్న రెండు మోటార్లు పాడయ్యాయి. అందులో ఒకటి పూర్తిగా చెడిపోగా మరొకటి పాక్షికంగా పాడపోయింది. రక్షిత మంచినీటి విభాగం (ప్రాజెక్ట్స్) నేతృత్వంలో తక్షణమే మరమ్మతులు చేయించాల్సి ఉన్నప్పటికీ ఇంతవరకు చేయించలేదు. దీంతో పట్టణంలో దాదాపు 4,500 నివాసాల్లో కుళాయిల ద్వారా తాగునీరు సక్రమంగా అందడం లేదు.

నిందలతోనే కాలయాపన..

ఇందిరమ్మ సుజలధార పథకం తాగునీటి పథకానికి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టాల్సిన బాధ్యత రక్షిత మంచినీటి విభాగం (ప్రాజెక్ట్స్) అధికారులపై ఉంటే.. ప్రతిరోజూ నీరు సరఫరా అవుతుందో లేదో పర్యవేక్షించాల్సిన బాధ్యత మేజర్ పంచాయతీ అధికారులపై ఉంటుంది. దాదాపు 40 వేల జనాభా కలిగిన చీపురుపల్లి మేజర్ పంచాయతీలో తాగునీటి సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందంటే అధికారుల పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నాలుగైదు రోజుల కిందటే మేజర్ పంచాయతీకి రిపోర్టు పంపించామని ఆర్‌డబ్ల్యూఎస్ (ప్రాజెక్ట్స్), తమకు ఇంతవరకు ఎటువంటి రిపోర్టు రాలేదని మేజర్ పంచాయతీ అధికారులు ఒకరిపై మరొకరు నిందలు వేసుకుంటున్నారు. ఉన్న రెండు మోటార్లలో ఒకటి పని చేయకపోవడం.. మరొకటి పాడవ్వడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు.

మరమ్మతులు చేయిస్తున్నాం..

ఇందిరమ్మ సుజలధార తాగునీటి పథకం సంప్‌ల వద్ద మోటార్లు పాడయ్యాయి. రెండు మోటార్లు ఉండగా ఒకటి పూర్తిగా పాడైపోయింది, దాని స్థానంలో కొత్తది కొనుగోలు చేయాల్సి ఉంది. మరొకదానికి మరమ్మతులు చేయిస్తున్నాం. ప్రస్తుతం ఇంటింటి కుళాయిలు ద్వారా నీరు అందిస్తున్నాం.. కానీ సరిపడా వెళ్లడం లేదు. త్వరలో సమస్యను పూర్తిగా పరిష్కరిస్తాం.

– వి.యుగంధర్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ (ప్రాజెక్ట్)చీపురుపల్లి



సంప్‌ల నుంచి ట్యాంక్‌లకు నీరు సరఫరా చేస్తున్న పైప్‌లైన్లు

రాష్ట్రస్థాయి పోటీలకు షికారుగంజి విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో మోడల్ పాఠశాల ప్రిన్స్‌పాల్ ఈశ్వరరావు

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి మోడల్ పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఈశ్వరరావు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల గజపతినగరం మండలం మరుపల్లిలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో ఎం.లీలాప్రసాద్, ఎల్. ప్రవళిక, బి. సాహితి, అలేఖ్య, రేష్మ, కె. కృష్ణవేణి, ఆర్. సాయిలక్ష్మి, గోపీచంద్, వరుణ్‌తేజ్, మనోజ్ కుమార్, సీహెచ్ నిఖిత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైనా పట్టించుకోరా...?



గొళ్లలవలసలో మరమ్మతులకు గురైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

మెరకముడిదాం: మండలంలోని గొళ్లలవలస గ్రామంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కొన్నినెలలు కిందట మరమ్మతులకు గురైంది... బాగుచేయాలని విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా కనీసం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. విద్యుత్ సరఫరా లేక తాగునీటి సరఫరా నిలిచిపోయిందని వాపోయారు. వ్యవసాయ మోటార్లకు కూడా విద్యుత్ సరఫరా కావడంలేదని రైతులు తెలిపారు. అధికారులు స్పందించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బాగుచేయాలని, లేదంటే కొత్తవి ఏర్పాటుచేయాలని కోరారు.

పీఎం సూర్యఘర్‌తో విద్యుత్ ఖర్చు ఆదా

మెరకముడిదాం: ప్రధానమంత్రి సూర్యఘర్ యూనిట్లు ఏర్పాటుచేసుకుంటే విద్యుత్ ఖర్చు ఆదా అవుతుందని విద్యుత్‌శాఖ ఏఈ దివాకర్ తెలిపారు. గర్భాం ఏపీజీవీబీ బ్యాంకు వద్ద విద్యుత్‌శాఖాధికారులతో కలిసి వినియోగదారులకు అవగాహన కల్పించారు. సోలార్ యూనిట్లు ఏర్పాటుతో తక్కువ పెట్టుబడితో నాణ్యమైన విద్యుత్‌ను పొందవచ్చన్నారు.



సోలార్ విద్యుత్ యూనిట్లపై వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న ఏఈ దివాకర్

23 నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

- డీఎల్‌డీఓ హేమసుందర్

చీపురుపల్లి: డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాల్లో ఈ నెల 23 నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు డివిజనల్ అభివృద్ధి అధికారి (డీఎల్‌డీఓ) కె.హేమసుందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చీపురుపల్లి డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాలతో పాటు రాజాం మున్సిపాలిటీలో సైతం ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 23 నుంచి 26 వరకు డివిజన్ పరిధిలోని కేటాయించిన 20 సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు కొనసాగుతాయన్నారు. శిబిరాల్లో 5 సంవత్సరాలు నుంచి 15 సంవత్సరాల మధ్య వయస్సు వారికి బయోమెట్రిక్ అప్‌డేషన్ చేస్తామని పేర్కొన్నారు.

చిన్నారులకు శక్తివంతమైన పోషణ అందించాలి

గుర్ల: చిన్నారులు, మహిళలకు శక్తివంతమైన పోషణ అందించాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఆరుద్ర సిబ్బందికి సూచించారు. గుజ్జింగివలసలో పోషణ మహోత్సవాలను ఆమె శుక్రవారం ప్రారంభించారు. ప్రస్తుతం చిన్నారులలో ఊబకాయం పెరుగుతోందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు అందించే పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను తల్లిదండ్రులకు వివరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తెట్టంగి పీహెచ్‌సీ సిబ్బంది, గ్రామ యువత పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

దత్తిరాజేరు: పౌష్టికాహారంతో ఆరోగ్యంగా ఉండవచ్చని పాచలవలస సర్పంచ్ సుమల శ్యామల, ఎంపీటీసీ సభ్యురాలు పోలూరి హైమావతి అన్నారు. కె. కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారి రఘు ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గర్భిణులు, బాలింతలు క్రమంతప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. 56 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేసినట్లు వైద్యులు చెప్పారు.

యూరియా ఆందోళనపై ఆరా



అధికారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి టి విమలారాణి

దత్తిరాజేరు: కూటమి ప్రభుత్వం సకాలంలో రైతులకు కావాల్సిన యూరియా సరఫరా చేయకపోవడంపై పెదకాదలో రైతులు గురువారం ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి మండల ప్రత్యేకాధికారి, ఐసీడీఎస్ పీడీ టి. విమలారాణి స్పందించారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ విజయభాస్కర్, తదితర అధికారులతో సమావేశమయ్యారు. ఆందోళనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ నుంచే ఏఓ అనురాధకు ఫోన్‌చేసి రైతులందరికీ శనివారం యూరియా పంపిణీ చేయాలని ఆదేశించారు.



వల్లంపూడిలో అధికారుల పర్యవేక్షణలో యూరియా పంపిణీ చేస్తున్న అధికారులు, యూరియా కోసం నిరీక్షిస్తున్న అన్నదాతలు

అన్నదాతకు తప్పని యూరియా కష్టాలు

వేపాడ: ఖరీఫ్ సీజన్ తుది దశకు చేరుకుంటున్నా రైతులకు యూరియా అందకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని వల్లంపూడి, ఆతవ రైతుసేవా కేంద్రాల్లో శుక్రవారం యూరియా పంపిణీ చేశారు. వల్లంపూడిలో రైతుసేవా కేంద్రంలో రైతులు ఉదయం నుంచి నిరీక్షించాల్సి వచ్చింది. ఆధార్, వన్‌బీ ఇచ్చే సమయంలో తోపులాట జరగడంతో ఎస్.కోట రూరల్ సీఐ అప్పలనాయుడు, వల్లంపూడి ఎస్సై సుదర్శన్, పోలీస్ సిబ్బంది సహకారంతో వ్యవసాయాధికారులు స్వాతి, అక్కునాయుడు, తదితరులు యూరియా టోకెన్లు పంపిణీ చేశారు. వల్లంపూడిలో 260 బస్తాలు, ఆతవలో 220 బస్తాలు పంపిణీ చేసినట్లు ఏఓ స్వాతి తెలిపారు.

‘చలో మెడికల్ కాలేజ్’కు తరలివెళ్లిన యువత



బొండపల్లి: బైక్‌లపై ర్యాలీగా వెళ్తున్న యువజన, విద్యార్థి సంఘ నాయకులు

బొండపల్లి: వైఎస్సార్‌సీపీ యువజన విభాగంతో పాటు విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో తలపెట్టిన చలో మెడికల్ కాలేజీ కార్యక్రమానికి మండలం నుంచి వందలాది నాయకులు, యువకులు శుక్రవారం తరలివెళ్లారు. పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు బోడసింగి జగదీశ్వరరావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ చేపట్టి.. అనంతరం విజయనగరం వెళ్లారు. కార్యక్రమంలో పార్టీ బూత్ ఇన్‌చార్జ్‌లు మహంతి రమణ, తాడ్డి చందు, నాయకులు తాళ్లపూడి అప్పలనాయుడు, మీసాల రాజేష్, మండల రామునాయుడు, సుంకరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వందలాది మంది యువత..

దత్తిరాజేరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించిన మెడికల్ కాలేజ్‌లను కూటమి ప్రభుత్వం ప్రైవేట్ పరం చేయడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం, యువజన విభాగం నాయకులు ‘చలో మెడికల్ కాలేజ్’ కార్యక్రమంలో పాల్గొనేందుకు బైక్‌లపై ర్యాలీగా తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ మండల యువజన నాయకుడు దత్తి చిరంజీవి ఆధ్వర్యంలో వందలాది మంది యువకులు కోమటిపల్లి పెట్రోల్ బంక్ వద్దకు చేరుకోగా.. ర్యాలీని జెడ్పీటీసీ సభ్యురాలు రౌతు రాజేశ్వరి జెండా ఊపి ప్రారంభించారు.

పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- కార్యదర్శుల సమీక్షలో జెడ్పీటీసీ సభ్యురాలు శిరీష

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య పనులపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జెడ్పీటీసీ సభ్యురాలు వలిరెడ్డి శిరీష సూచించారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో జెడ్పీటీసీ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ ఐ.సురేష్‌తో కలిసి ఆమె పారిశుధ్య పనులపై సమీక్షించారు. వీధుల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా పనులు చేయించాలన్నారు. తాగునీటి సరఫరాకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. బోర్ల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించాలని, దీనికోసం జెడ్పీ చైర్మన్‌ను అడిగి జిల్లాపరిషత్ నుంచి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, గ్రామ సచివాలయాల సమీపంలో పెంట కుప్పలు, చెత్త కుప్పలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఐ.సురేష్, మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులతో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, రేవల్ల సత్తిబాబు, గవిడి సురేష్, ఎల్.ప్రభాత్, తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శులుతో సమీక్షిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు శిరీష, ఎంపీడీఓ సురేష్

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణకు డిమాండ్



మెరకముడిదాం ఎండీఓ కార్యాలయం వద్ద డిమాండ్లతో కూడిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున ఎస్ఎస్ఏ ఉద్యోగులు

మెరకముడిదాం: ఎస్ఎస్ఏ ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించాలని మెరకముడిదాం మండలానికి చెందిన ఎస్ఎస్ఏ ఉద్యోగులు డిమాండ్ చేశారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద తమ డిమాండ్లతో కూడిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం విడుదలచేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ విద్యాశాఖలో రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగానే ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ప్రతినెలా 1వ తేదీన వేతనాలు చెల్లించాలని, సెలవులు మంజూరు చేయాలని కోరారు. హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఆగస్టునెల వేతనాలను చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు నవీన్‌కుమార్, రాజినాయుడు, భారతి, కళ్యాణి, స్వప్న, చిన్నఅప్పారావు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ సత్యవతి, ఎల్‌డీఏ పైడిరాజు, ఉగాది పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం

చీపురుపల్లిరూరల్ (గరివిడి): ఆయిల్‌పామ్ సాగు రైతుకు లాభదాయకమని ఉద్యానవన శాఖాధికారి ఎం.అనూష తెలిపారు. గరివిడి మండలం అర్తమూరు గ్రామంలో ఉద్యానవన శాఖ, రాధికా ఆయిల్‌పామ్ కంపెనీ సంయుక్తంగా ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాయి. ఆసక్తి గల రైతులకు ఉచితంగానే కంపెనీ వారు మొక్కలను సరఫరా చేస్తారని అనూష తెలిపారు. హెక్టారు విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగుకు రూ.29వేల రాయితీ ఉంటుందన్నారు. అంతర పంటలుగా మొక్కజొన్న, అరటి, బొప్పాయి, కూరగాయల పంటలు సాగుచేసి ఆదాయం పొందవచ్చన్నారు. ప్రస్తుతం టన్ను ధర రూ.19,095 ఉందని, ఎకరానికి రూ.లక్ష నుంచి రూ.1.30 లక్షల వరకు ఆదాయం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పొన్నాడ కుమార్, మాజీ సర్పంచ్ రమణమూర్తి, గ్రామ ఉద్యాన సహాయకుడు పార్థసారథి, రైతులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఉద్యానవన శాఖాధికారి

ఆర్టీసీ డిపో తనిఖీ

శృంగవరపుకోట: పట్టణంలోని ఆర్టీసీ డిపోను ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణాధికారిణి వరలక్ష్మి శుక్రవారం సందర్శించాఋ. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. పార్శిళ్లు, కొరియర్ సెక్షన్లను తనిఖీ చేసిన ఆమె ఆల్ట్రా డీలక్స్, పల్లెవెలుగు బస్సుల్లో ఉన్న డిక్కీలను పార్సిల్స్, కొరియర్ రవాణాకు అద్దె ప్రాతిపదికన ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీఎం సుదర్శన్, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఐడీ కిట్లతో ప్రయోజనం

గజపతినగరం రూరల్: బధిర చిన్నారులకు విద్యాశాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న ఐడీ కిట్లతో ఎంతో ఉపయోగమని ఎంఈఓ విమలమ్మ తెలిపారు. శుక్రవారం స్థానిక భవిత విద్యాకేంద్రంలో బధిర విద్యార్థులకు ఐడీ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భవిత కేంద్రాల్లో చిన్నారులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడంతో పాటు ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ -2 చక్రధర్, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం : ఐసీడీఎస్ పీఓ నాగమణి



పెదమంత్రిపేటలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న చీపురుపల్లి ఐసీడీఎస్ పీఓ నాగమణి

మెరకముడిదాం: పౌష్టికాహారంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఆరోగ్యం సిద్ధిస్తుందని చీపురుపల్లి ఐసీడీఎస్ పీఓ నాగమణి తెలిపారు. మండలంలోని ఊటపల్లి, పెదమంత్రిపేట గ్రామాల్లో స్వస్థ్ నారీ–స్వశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించిన పౌష్టికాహారం స్టాల్స్‌ను సూపర్‌వైజర్లు శ్రీదేవి, సీహెచ్ కృష్ణవేణితో కలిసి పరిశీలించారు.

పారిశుధ్య పనుల పరిశీలన

చీపురుపల్లి: మండలంలోని నిమ్మలవలసలో పారిశుధ్య పనులను డివిజనల్ అభివృద్ధి అధికారి (డీఎల్‌డీఓ) కె.హేమసుందర్ శుక్రవారం పరిశీలించారు. తడి, పొడి చెత్త సేకరణ, తాగునీటి నీటి సరఫరా, క్లోరినేషన్ తదితర అంశాలపై ఆరా తీశారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీఓ ప్రవీణ్, కార్యదర్శి లక్ష్మి ఉన్నారు.

క్షయ రోగులకు పౌష్టికాహారం పంపిణీ

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయవ్యాధితో చికిత్స పొందుతున్న 36 మంది రోగులకు ఒంగోలు జిల్లా సుమతి చారిటబుల్ ట్రస్టు సభ్యులు శుక్రవారం పౌష్టికాహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గరివిడి, బొండపల్లి పీహెచ్‌సీల వైద్యాధికారులు రాజ్యలక్ష్మి, సాయికిరణ్, అనిల్, సూపర్‌వైజర్ లలిత పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

గజపతినగరం రూరల్: మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యులు రాజేష్ పల్లంరాజు, అఖిలేష్ ఆధ్వర్యంలో 200 మందికి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాధారణ పరీక్షలైన బీపీ, సుగర్‌తో పాటు ఈసీజీ పరీక్షలు కూడా చేశామన్నారు. సీజనల్ జ్వరాలతో బాధపడుతున్న వారికి మందులు అందజేశామన్నారు.

మహిళల ఆందోళన

జామి: మండల కేంద్రమైన జామి మాధవరాయి మెట్ట కాలనీకి చెందిన మహిళలు శుక్రవారం స్థానిక స్టోన్ క్రషర్ వద్ద ఆందోళన చేపట్టారు. క్రషర్ పరిమితికి మించి క్రషింగ్ చేయడం వల్ల దుమ్ము, ధూళి ఎక్కువగా రావడంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బ్లాస్టింగ్‌లు కూడా నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్నా, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి క్రషింగ్ నిలిపివేయాలని కోరారు.



ఆందోళన చేస్తున్న మహిళలు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొండపల్లి: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మూడు గ్రామాలకు శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు బొబ్బిలి సబ్‌డివిజన్ ఈఈ బి.రఘు, బొండపల్లి ఏఈఈ ఆర్.శంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జంగిల్ క్లియరెన్స్ చేపట్టనున్న నేపథ్యంలో సబ్‌స్టేషన్ పరిధిలోని బొండపల్లి, గెద్దపేట, చందకపేట గ్రామాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

శృంగవరపుకోట: పుణ్యగిరి ఫీడర్ పరిధిలో మెయింటెనెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు సరఫరా ఉండదని ఈఈ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని బర్మాకాలనీ, వైఎస్సార్ కాలనీ, రేగ పుణ్యగిరి, రైల్వే క్వార్టర్స్, పుణ్యగిరి ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

మెరకముడిదాం: మండలంలోని గాదెలమర్రివలసలో శుక్రవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. వెటర్నరీ అసిస్టెంట్ గౌరినాయుడు పశువులకు వైద్యపరీక్షలు చేశారు. 252 పశువులకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలు వేశారు. గాలికుంటువ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు.